# వెంటాడే పిలుపు

రాజమణి చీకట్లో ఒంటరిగా కూచుంది... వెలుతుర్లోకి రావాలంటే భయం...

ఎప్పుడూ చీకట్లోనే వుండాలన్నా భయం...

బతుకంతా భయం భయం...

భవిష్యత్తు మరీ భయం..

వెనకా ముందూ ఎవరూలేని ఒంటరితనం... తన తోడు పంచుకునే వాడు... నీడనిస్తాడనుకున్నవాడు... అర్థవంతమవుతుందనుకున్న జీవితాన్ని చాలించి అర్ధాంతరంగా వెళ్లిపోయాడు.

ఆ మూణ్ణెళ్ల సంసారంలో కడుపులో ఓ నలుసైనా పడితే...

ఆ బిడ్డలో తననీ, తండ్రినీ, చూసుకుంటూనైనా బతికేది. ఈ భయంకరమై ఒంటరి తనానికి అడ్డుకట్టవేసేది.

ఆలోచనల్లో వుండగానే... ఇంటి ముందు 'అంబా' అన్న అరుపు... ఆ అరుపు మూడేళ్లుగా చిరపరిచితమే... పోతురాజు వచ్చాడనుకొంది.

బకెట్లో వున్న కుడితి నీళ్లలో నిన్న మిగిలిపోయిన అన్నం, ఈరోజు వొంపిన గంజి కలిపి బకెట్ తీసుకొచ్చి... ఇంటిముందు నిల్చున్న దున్నపోతు ముందుంచింది.

అది ఆబగా జుర్రుతుంటే... గమనించింది. ఈ మధ్య ఎవరూ కుడితినీళ్లు పెట్టక బక్క చిక్కుతోంది.

మూడేళ్లకింద అది వూర్లోకొచ్చినప్పుడు... ఆడపిల్లలమంతా ముసిముసిగా నవ్వుకున్నాం.

ఆరోజు వాగు దగ్గరికి మంచినీళ్ల బిందెలు పట్టుకొని తను, సుజాత, సంధ్య, ఉమ, లక్ష్మి తామంతా వెళ్తుంటే... గ్రామ పంచాయతీ రచ్చబండ మీద వూరి రైతులంతా పంచాయితీ జరుపుతుంటే ఆగిపోయాం. విషయం తెల్సుకున్న తర్వాత ఎంతగా నవ్వుకున్నామో...

కానీ... 'పాడి'నే నమ్ముకున్న రైతులకి అదెంతటికీ తీరని సమస్య?

"వూర్లో బర్రెలు ఏవీ కూడా రెండేళ్లనించీ సూడికి రావటం లేదు. అందరం కల్సి బర్రెల మీద పారడానికి దున్నపోతుని కొనాలి. మీరేమంటారు?" సర్పంచ్ అడిగాడు.

"వూరి మీదికి దున్నపోతుని కొనాలని ఎన్నాళ్లనించోమొత్తుకుంటున్నాం. వూర్లో ఇంతమందిమి రైతులముండి, అందరికీ బర్రెలుండి... పాలు పెరుగు పక్కూరి వాళ్లనించి కొనుక్కోవటం సిగ్గనిపిస్తుంది." ఓ మోతుబరి రైతు గట్టిగానే అన్నాడు.

"మంచి పోతుని కొనాలంటే ఆదివారం జగిత్యాల అంగట్లకు బోవాలె. కనీసం వెయ్యి, రెండువేల లోపుది కొంటేనే... మన బర్రెలేమన్నా సూడికత్తయ్. మరి... అంత డబ్బు గ్రామపంచాయితీలకెల్లి తీయటం కుదుర్దు కాబట్టి... రైతులంతా తలా ఇంతని వేస్కోవాలి..." తిరిగి చెప్పాడు సర్పంచ్.

"అందరు రైతులకు ఎలా వేస్తాం.. బర్రెలున్న ఇంటికి ఇంతని వేయాలి" అన్నాడు మరోరైతు.

"అదీ కరక్టే... అందరికీ ఎట్లావేస్తాం? ఎవలెవలకు బర్రెలున్నయో చెప్పరాదుండ్రి... లిస్టు రాద్దాం" అన్నాడు ఉపసర్పంచి.

పావుగంటలో పేర్లు తయారయ్యాయి.

"అది సరే... అంతమంచిగనే వున్నది కాని... దానికి మేత ఎట్లామరె?" సందేహంగా అడిగాడో రైతు.

"నీయవ్వ... పోతుకొన్నంక తనుగుకి భయపడతామె రాజన్నా... ఇంటికింత కుడితి నీళ్లో, చలిబువ్వో పడేత్తే... ఊరిమీద పడి అదే ఊరుతది" అన్నడు వెంకన్న అనే రైతు.

"సరే... ఎల్లుండి ఆదివారం జగిత్యాల అంగట్లకు ఎవలెవలు వోతరు?" అనడిగాడు సర్పంచి ఇద్దరు యువ రైతులు "మేం పోతంలే" అన్నారు.

"అంగడంత మంచిగ తిరిగి... బేరం చేయుండ్రి. అంగడికి దగ్గరని సీరామ టాకీసుల సీన్మాజూసి బక్కపోతుని తెచ్చేరు" నవ్వుతూ హెచ్చరించాడు మరో రైతు.

వూరంతా కల్సి దున్నపోతు కొనడానికి ఏకగ్రీవ తీర్మనం చేసారు.

ఆ పంచాయతీని విచిత్రంగా ఖాళీ బిందెలు పట్టుకొని నిల్చుండి చూస్తున్న ఆడపిల్లల్ని చూడగానే... కింద వేసుకున్న పంచెదులుపుతూ లేచిన రంగయ్య తాత...

''ఇగ గీ పెయ్య దూడలకు... మంచి పోతుల్ని చూడాలె'' అన్నాడు సరసంగా.

''గా పోతులు వెయ్యి రెండు వేలల్ల దొరుకుతాయె... లచ్చలకు లచ్చలు గావాల్నాయె'' నవ్వుతూ అన్నాడు మరో రైతు.

ఆ మాటలు విని ''ఛీ తాతా... పోయే...'' అంటూ బిందెలతో వాగువైపు పరిగెత్తారంతా.

తర్వాత...

నాల్రోజులకి... నల్లగా, దృఢంగా నిగనిగలాడుతూ వచ్చిన దున్నపోతుని చూసి అంతా ముచ్చటపడి దానికి 'పోతురాజు' అనిపేరు పెట్టారు.

కాలం కరిగిపోతూనేవుంది... ఎడాదిలో బర్రెలు సూడికొచ్చాయి.

వూర్లో పుష్కలంగా పాడి దొరుకుతోంది.

ఆనాటి ఆడపిల్లలందరికీ కూడా ఈ మూడేళ్లల్లో పెళ్లిళ్లయ్యాయి...

కాని రాజమణి బతుకే పెళ్లయిన మూణ్ణెళ్లకే చితికి పోయింది. భర్త యాక్సిడెంటులో చనిపోయాడు.

పోతురాజు కుడితి తాగి అంబా అని అరవటంతో రాజమణి ఈ లోకంలోకి వచ్చి పడింది. ఇప్పుడు దాన్ని వూర్లో ఎవరూ పట్టించుకోవట్లేదు. ఆకలితో ఎవరి చేన్లోనైనా పడితే 'దొంగగొడ్డు' అని తిడుతున్నారు, కొడుతున్నారు.

దాంతో అది బాగా చిక్కిపోయింది.

* * * *

రాజమణి అంతరాంతరాల్లో మొదలైన సంఘర్షణ... సుడిగుండమై సుల్లు తిరుగుతూ గుండెను అతలాకుతలం చేస్తోంది.

ఈ ఒంటరితనాన్ని జయించడానికి...

నిండారుగా నవ్వడానికి...

నింపాదిగా ఆడుకోడానికి...

నిలువెల్లా పులకరించడానికి...

తనకో... బిడ్డ కావాలి!

తనకో బిడ్డ కావాలి!?

మగాడి తోడు అవసరం లేదు... అమ్మతనంలోని ఆత్మీయతని అల్లుకొని వచ్చి... బుడి బుడి నడకలతో ముద్దాడి... తను ప్రతిక్షణం పలవరించేలా... తనని పలకరించేలా... ఈ బ్రతుకుని సంతోషంగా వెళ్లదీయడానికి...

తనకో బిడ్డ కావాలి!!!

నెలరోజులుగా పడుతున్న మథనంతో... భయం, పరువు పోటీపడుతున్నాయి. తనెవరికీ

ద్రోహం చెయ్యటంలేదు. ఆ మాత్రం ఆనందాన్నయినా తన జీవితంలో నింపుకుంటే తప్పేంటి? ఈ ఒంటరి జీవితంలోకి... ఆ వెలుగు ఎలా రావాలి? ఎలా? ఎలా??

ఆమె ఆలోచనల్లో వుండగానే 'రాజమణీ... రాజమణీ... కొంచెం అన్నంపెట్టవూ...' అంటూ వినాయకులు వచ్చాడు. వాడికి వయసూ, శరీరం పెరిగినా మనసు ఎదగలేదు. దాన్ని అవకాశంగా తీసుకున్న రాజమణి... వినాయకులుకి కడుపారా అన్నంపెట్టి... అల్లుకు పోయింది.

అప్పుడే రాజమణి ఇంట్లోకి వచ్చిన అనసూయ అయ్యో... అయ్యో... అని మొత్తుకుంది. కేకలు వేసింది. బిల బిలా ఆడమగా అంతా పరిగెత్తుకొచ్చారు.

"వినాయకులు గాడు అమాయకుడనుకున్నాం... రాజమణి మీద పడ్డాడు" అంది.

అంతే! వినాయకుల్ని కొట్టారు, తన్నారు, రాజమణి మూగవోయి నిల్చుంది. వినాయకులు అరుపులు విన్లేని రాజమణి 'ఆగండీ' అని అరచింది.

అప్పటికే వినాయకుడి ఒళ్లు హూనమైంది.

"వినాయకుడి మీద నేనే పడ్డాను" అంది తలదించుకొని.

ఆ తర్వాత గంటకి... రాజమణి పంచాయితీలో పెద్దల ముందు నిల్చుంది. రకరకాల మాటలు ... నిలువెల్లా చీల్చాయి.

చివరగా... రాజమణి తప్పుకి అయిదు వందల జరిమానా విధించారు.

* * * *

రాజమణి అవమానంతో కుంగిపోయి ఇంట్లోకి అడుగుపెడుతుంటే... మణీ అని పిలిచింది సుజాత. సుజాతని చూడగానే బావురుమంది. వాళ్లిద్దరూ చిన్నప్పట్నించీ స్నేహితులు.

"నీ బాధని నేనర్థం చేసుకోగలనే... నేను మాయింటికి గోదావరిఖని వెళ్తున్నాను. వారం పదిరోజులు మా ఇంట్లో వుండు వద్దువు గాని... రా..." అంది అప్యాయంగా.

కన్నీల్లతో 'సరే' నని తలూపింది రాజమణి.

* * * *

పదిరోజుల తర్వాత గోదావరిఖని నించి వచ్చిన రాజమణికి... మళ్లీ ఒంటరితనం ఆవరించింది. దు:ఖం పెకిలించుకొని కన్నీళ్లు రావడానికి మూగవోయిన గుండె మౌనంగా రోదిస్తోంది. సాయంత్రం కాగానే... ఎప్పటిలాగే 'అంబా' అన్న పిలుపు కోసం చూసింది.

ఆ రోజు చీకటిపడినా 'పోతురాజు' రాలేదు.

ఆరోజే కాదు... రెండు మూడు రోజుల వరకూ ఆ పిలుపూ విన్లేదు. ఎవరి చేనులోనైనా పడితే బంజరుదొడ్డిలో కట్టేసి వుంటారనుకొంది.

రంగయ్య తాత కనపడి పలకరిస్తే "తాతా... పోతురాజు కన్పడటం లేదేంటి?"

అనడిగింది.

"దానికి మేతవేసే వాళ్లెవరు తల్లీ... తిండి దొరక్క అది బక్కగొడ్డులా అయింది. దాని మెడదగ్గర పుండయి ఈగలు ముసిరితే... ఇంటి ముందుకురాగానే చీదరించుకొంటూ తరిమేవాళ్లు. దాంతోని పూరోళ్లంతా కల్సి రెండొందలకు 'కోత'కి అమ్మేసారు. రజాకగాడు దాన్ని కొని అల్‌కబీర్‌కు పట్టుకుపోయిండు. ఈ మనుషులింతే తల్లీ... గొడ్డుకో న్యాయం... మనిషకో న్యాయం... ఏరు దాటంగానే తెప్పతగిలెయ్యటం..." అంటూ వెళ్లిపోయాడు. రాజమణి కూలబడిపోయింది. కాలం ఒంటరిగా అల్లుకుపోతోంది.

అంబా అన్న పిలుపు కోసం..

అమ్మా అన్న పిలుపు కోసం...

రాజమణి రోజూ ఎదిరి చూస్తోంది.

ఆ పిలుపులు... అనుక్షణం ఆమెని వెంటాడుతున్నాయి.